'నాడు - నేడు'తో పునరుజ్జీవం



'నాడు - నేడు' నిధులతో నిర్మించిన 12 యూనిట్ల టాయిలెట్లు

- చిట్టివలస బాలికల హైస్కూల్‌లో రూ.1.16 కోట్లతో వసతులు
- న్యూలుక్‌తో పెరిగిన అడ్మిషన్లు



'నాడు - నేడు' నిధులతో నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులు

తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్ నుంచి పన్నెండేళ్ల క్రితం వేరుపడిన బాలికల హైస్కూల్‌కు 'నాడు – నేడు' పనులతో పునరుజ్జీవం లభించింది. ఫలితంగా అడ్మిషన్లు భారీగా పెరిగాయి. గతంలో చిట్టివలస హైస్కూల్ నుంచి బాలికల హైస్కూల్ వేరుపడినప్పుడు 160 మంది విద్యార్థినులు, ఐదుగురు ఉపాధ్యాయినులు, నాలుగే తరగతి గదులు, తెలుగు మీడియంలో బోధన, సరిపడని టాయిలెట్లు, అంతంత మాత్రంగా తాగునీటి వసతులు ఉండేవి. దీంతో తమ పిల్లలను ఈ హైస్కూల్‌లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపేవారు కాదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయిన విషయం అందరికీ తెలిసిందే. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు వసతులు సమకూరాయి. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ఇక్కడి విద్యార్థులకు ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం బోధన కొత్త ఉత్తేజాన్ని నింపింది. 2019కు ముందు ప్రభుత్వాలతో పోలిస్తే గత ఐదేళ్లలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో మధ్యాహ్న భోజనంలో మార్పులతో పౌష్టికాహారం, అల్పాహారంగా రాగి అంబలి, వేరుశనగ, బెల్లంతో చేసిన పప్పు చెక్కీ, నాణ్యమైన యూనిఫారాలు, ఉచిత పుస్తకాలు, అదనంగా బూట్లు, సాక్సులు, డిక్షనరీ, బ్యాగులు చేర్చారు. ఈ వసతులన్నీ చిట్టివలస బాలికల హైస్కూల్‌కు కొత్త ఉత్తేజాన్నిచ్చాయి. అందులోనూ భీమిలి నియోజకవర్గంలో ఏకైక బాలికల హైస్కూల్ కావడంతో దూర ప్రాంతాల నుంచి కూడా తల్లిదండ్రులు తమ చుట్టుపక్కల ఉన్న విద్యాసంస్థలను కాదని పిల్లలను ఇక్కడ చేరుస్తున్నారు.



చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యార్థులతో కుటుంబీకులు

'నాడు – నేడు' నిధులతో వసతులు

'నాడు – నేడు' రెండో విడతలో భాగంగా చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌కు రూ.1.16 కోట్ల నిధులు గత ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో నుంచి ఫర్నిచర్, ఆర్వో ప్లాంట్, బోర్డులు, మరమ్మతులు, విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. వీటితోపాటు నాలుగు అదనపు తరగతి గదులు, 12 యూనిట్ల టాయిలెట్లు, ప్రహరీ నిర్మించారు. దీంతో ప్రస్తుతం ప్రారంభమైన విద్యాసంవత్సరానికి విద్యార్థుల సంఖ్య 250 దాటిపోగా ఆన్‌లైన్‌లో 72 కొత్త అడ్మిషన్లు వచ్చాయి. ప్రస్తుతం 10 తరగతి గదులు, ఒక్కొక్కటి చొప్పున సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఆర్వో ప్లాంట్‌కు గదులు సమకూరాయి. 10 మంది ఉపాధ్యాయులు, ఇంగ్లిష్ మీడియం బోధనతో మిగిలిన ప్రభుత్వ, ప్రైవేట్, జెడ్పీ హైస్కూళ్లతో పోటీపడి న్యూలుక్‌తో విద్యార్థినులకు ఆహ్వానం పలుకుతోంది.

వసతులు బాగున్నాయి



మా అమ్మాయి అంజలి 9వ తరగతి వరకు భీమిలిలో చదువుకుంది. మా పంచాయతీలో జెడ్పీ హైస్కూల్ ఉంది. మా గ్రామానికి అందుబాటులో పలు ప్రైవేట్ పాఠశాలలూ ఉన్నాయి. అయినప్పటికీ చిట్టివలస బాలికల హైస్కూల్‌లో అన్ని వసతులు, పరీక్షా ఫలితాలు బాగుండడంతో దూరమైనా ఇక్కడ చేర్పించాను.

– అంజలితో తల్లి కొంగరాని లక్ష్మి, తాళ్లవలస

ఆటో ద్వారా పంపిస్తాం



నా మనుమరాలు పైల భువనేశ్వరి 8వ తరగతి వరకు మత్స్యకార గ్రామమైన అన్నవరంలో చదువుకుంది. మా పక్క పంచాయతీలోనే జెడ్పీ హైస్కూల్ అందుబాటులో ఉన్నా నెలకు రూ.వెయ్యి ఇచ్చి చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు పంపిస్తున్నాం. ఈ ఏడాది 9వ తరగతిలో చేర్పించాం. ఇక్కడ చదువుతోపాటు సౌకర్యాలు చాలా బాగున్నాయి.

– మనుమరాలు భువనేశ్వరితో అమ్మమ్మ దువ్వి రామయ్యమ్మ, పైలపేట

చక్కగా బోధిస్తున్నాం



చిట్టివలస బాలికల హైస్కూల్‌లో అన్ని వసతులూ ఉన్నాయి. గతంలో వసతులు లేవని అన్నవాళ్లే ఇప్పుడు చూసి ఆశ్చర్యపోతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు మంచి ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారు. మిగిలిన పాఠశాలలతో పోలిస్తే అడ్మిషన్లు ఎక్కువగా వస్తున్నాయి. దూరప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు చేరుతున్నారు.

– సీహెచ్ రోజామణి, ప్రధానోపాధ్యాయురాలు, జెడ్పీ హైస్కూల్, చిట్టివలస.

17 నుంచి వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు



వేణుగోపాల స్వామి విగ్రహం

పద్మనాభం : మండలంలోని పాండ్రంగిలో ఈ నెల 17 నుంచి 21 వరకు వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలకు దేవదాయ శాఖ, ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 17న ముందుగా అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు వేణుగోపాల స్వామి, రుక్మిణి మాత విగ్రహాలను ప్రత్యేకంగా రూపొందించిన వేదక వద్దకు తోడ్కొని వచ్చి వేద పండితులు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 18, 19, 20న విశేష హోమాలు నిర్వహిస్తారు. 21న శ్రీ పుష్పయాగంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

ఘనంగా కోదండరామ స్వామి ఆలయ వార్షికోత్సవం



వెండి కిరీటాలతో విగ్రహాల వద్ద భక్తులు

పద్మనాభం : మండలంలోని వెంకటాపురంలో కోదండరామ స్వామి ఆలయ రెండో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కోదండ రాముడు, లక్ష్మణ, సీత, అంజనేయ స్వామి విగ్రహాలకు రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, డీలర్ కర్రి శ్రీను రూ.70వేలు విలువ చేసే వెండి కిరీటాలు బహుకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, వెంకటాపురం సర్పంచ్ కర్రి రమణ, మాజీ సర్పంచ్ ఆవాల గంగరాజు, మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణమూర్తిరాజు, తదితరులు కోదండ రామ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

క్లుప్తంగా

మొక్కలకు సంరక్షణ కరవు



ఎండిపోతున్న మొక్కలు

కొమ్మాది : సాగర్‌నగర్ నుంచి భీమిలి వరకు పచ్చదనం పరిరక్షణలో భాగంగా రోడ్డు డివైడర్ మధ్యలో గత ప్రభుత్వం మొక్కలు ఏర్పాటు చేసింది. వాటికి రోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా నీరు అందిస్తూ సంరక్షించేవారు. అయితే ఇటీవల అధికారుల నిర్లక్ష్యం కారణంగా పచ్చని మొక్కలు ఎండిపోతూ దర్శనమిస్తున్నాయి. దీనివల్ల ఆ ప్రాంతమంతా కళావిహీనంగా కనిపిస్తోంది. పచ్చని మొక్కలను సంరక్షించడంలో విఫలమైన అధికారుల తీరుపై ప్రకృతి ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కొమ్మాది : ఎండాడ అథ్లెటిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న 10కే, 5కే, 2కే రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను అథ్లెటిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. ఆసక్తి గల వారు సంప్రదించాలని సీఈవో బీహెచ్ గోపి తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ రాజేశ్వరి రెడ్డి, పి.రాజేష్, వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో చల్లదనం



స్వతంత్రనగర్‌లో గొడుగు వలే ఉన్న భారీ వృక్షాలు

మధురవాడ : హుద్‌హుద్ మహా విలయాన్ని కూడా తట్టుకుని నిలబడి, మండుటెండల్లో ఆహ్లాదాన్ని, చల్లదనాన్ని పంచుతున్నాయి మధురవాడ స్వతంత్రనగర్, మధురవాడ జంక్షన్, మిథిలాపురి ఉడా కాలనీ, రెవెన్యూ లే అవుట్‌లోని భారీ వృక్షాలు. ఇవి మాస్టర్ ప్లాన్, ఇతర రోడ్ల వెంబడి పెట్టని గొడుగుల్లా నిలుస్తూ ఉన్నాయి. దీంతో ఎక్కడ చూసినా పాదచారులు గుంపులు గుంపులుగా నిలబడి సేద తీరుతున్నారు. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న తరుణంలో కూడా వీటిని స్థానికులు, ప్రభుత్వాలు కాపాడుతున్నాయి. దీంతో ఈ ప్రాంత వాసులతోపాటు ఇక్కడకు వచ్చిన వారు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



మధురవాడలోని సమీకృత బాలుర వసతి గృహం

మధురవాడ : మధురవాడ కరెంటు ఆఫీసు సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇక్కడ ఎస్సీ విద్యార్థులకు 138, ఎస్టీలకు 23, బీసీలకు 112, జనరల్ విద్యార్థులకు 25 కలిపి మొత్తంగా 298 సీట్లు ఉన్నాయి. ఇందులో 3వ తరగతి నుంచి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సిబ్బంది కోరారు. మరిన్ని వివరాలకు వార్డెన్లు ఎస్.రమేష్ 91548 79173, సరోజిని 98483 77248, సురేంద్ర 94403 43757ను సంప్రదించాలని కోరారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేశారు. శ్రీవారిని దర్శనం చేసుకున్న తర్వాత మహాలక్ష్మి, గోదాదేవిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటం, శ్రీవారి నామసంకీర్తన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

బాలవికాస్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



బాలవికాస్ విద్యార్థులతో సాయిభక్తులు

తగరపువలస : ఆనందపురం మండలం శ్రీసత్య సాయి ఆదర్శగ్రామం గొట్టిపల్లి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో శనివారం స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులకు సాయి భక్తులు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కొట్యాడ లక్ష్మణమూర్తి, పి.ఎస్.ఎన్.మూర్తి, బి.ఎల్.రాజు సమకూర్చిన 200 నోట్ పుస్తకాలను 40 మంది విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రుత్తల సన్యాసిరావు, ఆదర్శ గ్రామం కో ఆర్డినేటర్ డబ్బీరు విజయకుమార్, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడుబాబు, సత్య సాయి సేవా సంస్థల విశాఖ జోన్ కో ఆర్డినేటర్ మానాపురం సత్యసాయికుమార్, భజన మండలి కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు, కో కన్వీనర్ డీపీ రాజు, యూత్ కో ఆర్డినేటర్ డి.శరత్‌కుమార్, బాలవికాస్ ఇన్‌చార్జి డీవీ సంతోష్ కిరణ్, సేవాదళ్ కో ఆర్డినేటర్ డి.కార్తీక్, మహిళా సేవాదళ్ లాస్య, సీనియర్ ఉపాధ్యాయుడు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మణరావు జన్మదిన వేడుకలు



వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లక్షణరావుకు కేక్ తినిపిస్తున్న నాయకులు

పద్మనాభం : మండలంలోని కోరాడలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు జన్మదిన వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు కేక్ కట్ చేశారు. లక్ష్మణరావుకు వైస్ ఎంపీపీ కోరాడ మంజు భార్గవి, సోదరుడు రామునాయుడు, అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోరాడ తాతినాయుడు, పాండ్రంగి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఉభయాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

శాస్త్రీయ సంగీత కార్యక్రమం నేడు

తగరపువలస: శ్రీగురురాజ సంగీత శిక్షణాలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి చిట్టివలస బంతాట మైదానంలో శిక్షణాలయ విద్యార్థులచే శాస్త్రీయ సంగీత కార్యక్రమం నిర్వహించనున్నారు. భీమిలి యోగ చైతన్య సంస్థ యోగాచార్యులు సీహెచ్.వెంకటరమణ, ప్రముఖ తెలుగు పద్యకవి బులుసు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని శిక్షణాలయం వ్యవస్థాపకులు వి.సంతోష్‌కుమార్ తెలిపారు. వివరాలకు 98858 86683లో సంప్రదించాలని కోరారు.

భారతీయ సంప్రదాయ ఔషధం ఆయుర్వేదం

బీచ్‌రోడ్డు: ఆయుర్వేదం అనేది శరీరం, మనస్సు, ఆత్మ సమతుల్యతను కాపాడుకునే లక్ష్యంతో భారతదేశంలో పుట్టిన సంప్రదాయ ఔషధమని ఆయుర్వేద వైద్యుడు గౌతమస్ కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఆయుర్వేదంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంలోని వివిధ చికిత్సల్లో వర్మ థెరపీ ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. వేల సంవత్సరాలుగా ఈ థెరపీ ద్వారా దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల్లో వివిధ వ్యాధులు నయం చేస్తున్నారన్నారు. ఇది ముఖ్యంగా తమిళ సిద్ధవైద్యంలో అంతర్భాగమన్నారు. నేటి అత్యాధునిక వైద్య విధానాలకు అనుగుణంగా ఆయుర్వేదంలో కూడా పలు మార్పు చేసి రోగులకు చికిత్సను అందించడం అభినందనీయమన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, అలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరమైతే ఉజ్వల భవిత



సదస్సులో మాట్లాడుతున్న విశాఖ నార్త్ ఏసీపీ సునీల్

పీఎం పాలెం : మానసిక, శారీరక ఆరోగ్యాలపై తీవ్ర దుష్ప్రభావం చూపే దురలవాట్లకు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా వుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని విశాఖ నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ బి.సునీల్ అన్నారు. జీవీఎంసీ 7వ వార్డులోని పిలకవానిపాలెంలో గల శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం సాయంత్రం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల కలిగే అనర్థాలు వివరించారు. చెడు అలవాట్లకు బానిసలైతే భవిష్యత్ నాశనమవుతుందన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ వై.రామకృష్ణ సూచించారు. పార్ట్ టైమ్ జాబ్స్, లాటరీ, టాస్క్ బేస్డ్ హై ఇన్‌కమ్, క్రెడిట్ కార్డు లిమిట్ పెంచడం, తదితర ఆన్‌లైన్ స్కామ్స్ పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు. సదస్సులో పోలీసు సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

17న శ్రీ శృంగేరీ శంకర మఠం వార్షికోత్సవం

పీఎం పాలెం : జీవీఎంసీ ఆరో వార్డు పరిధి బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠం వార్షికోత్సవాలు ఈ నెల 17న ఘనంగా నిర్వహించనున్నట్టు మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి 12 వరకూ శ్రీ ఉమామహేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి, విశేష రుద్రాభిషేకాలు, అర్చనలు చేస్తామన్నారు. ఆ రోజు సాయంత్రం 7 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్యంపై వర్క్‌షాపు



వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న గీతా శ్రీకాంత్ తదితరులు

ఎంవీపీకాలనీ: రోటరీ క్లబ్ విశాఖ, ఎంఎస్‌ఎంఈ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏపీ చాంబర్స్ ఉమెన్ వింగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పేరిట వర్క్‌షాపు నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్‌లో శనివారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. కొత్త వ్యాపారాలకు అందుబాటులో ఉన్న పథకాలు, రాయితీలపై ఔత్సాహిక వ్యాపారవేత్తలకు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి అవగాహన కల్పించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ప్యాకేజింగ్, లైవ్‌స్టాక్ సెక్టార్‌లలో కొత్త పారిశ్రామికవేత్తలకు అవసరమైన హ్యాండ్ హోల్డింగ్ అందించడానికి వర్కుషాపు నిర్వహించినట్లు ఏపీ చాంబర్స్ ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ గీతా శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌డీసీ ప్రతినిధి డాక్టర్ బి.సాహు, పశువర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూధనరావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు సీఏడీఎం రావు తదితరులు పాల్గొన్నారు.

పడవెళ్లిపోయింది.. ఎడ్లబండి వచ్చింది



డెయిరీ ఫారం కూడలిలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండి

ఆరిలోవ: జాతీయ రహదారిపై పదో వార్డు పరిధి పాత డెయిరీఫారం కూడలిని జీవీఎంసీ ఇటీవల ఆధునికీకరించింది. ఫౌంటెన్, దాని మధ్యలో గోడ, చుట్టూ ఇనుప గ్రిల్స్ నిర్మించారు. ఫౌంటెన్ మధ్యలో నిర్మించిన గోడపై చూపరులను ఆకట్టుకునేలా ఓ పడవను ఏర్పాటు చేశారు. దీంతో ఈ కూడలికి మరింత అందం వచ్చింది. ఇటీవల అధికారులు ఆ పడవను వేరో చోటుకు తరలించారు. పడవకు బదులుగా ఎడ్లబండిని శనివారం ఏర్పాటు చేశారు. దీంతో మరింత ఆకర్షణీయంగా కూడలి మారింది.